ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 04-11-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

ముఖ్యాంశాలు

- ఓర్నాట్, మురాసు తుఫానుల ప్రభావంతో రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తెలియజేశారు.

- రేపు జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా.. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశం నిర్వహించారు.

- మురాసు తుఫాన్ ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా దెబ్బతిన్న రహదారుల పునరుద్ధరణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టినట్లు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు.

- ఆక్లాండ్ లో ఈరోజు జరిగిన తొలి వన్డే క్రికెట్ మ్యాచ్ లో న్యూజిలాండ్‌పై భారత్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

==========

ఓర్నాట్, మురాసు తుఫానుల ప్రభావంతో భారీ వర్షాలు, బలమైన గాలుల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తెలియజేశారు. ఈ ఉదయం ప్రధానమంత్రి.. ముఖ్యమంత్రికి ఫోన్ చేసి, రాష్ట్రంలో వారం వ్యవధిలో రెండు తుఫానుల ప్రభావానికి గురైన ప్రాంతాల్లోని పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి.. తుఫాన్ల వల్ల కలిగిన నష్టాన్ని ప్రధానమంత్రికి వివరించారు. రహదారులు, విద్యుత్ సరఫరా వ్యవస్థలు, ఇతర రంగాలకు భారీ నష్టం జరిగిందని, ఈ నష్టాలను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం తగిన సహాయం అందించాలని ముఖ్యమంత్రి కోరారు. కాగా.. తుఫాను సహాయక చర్యలను సమర్థవంతంగా నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వ కృషిని ప్రధానమంత్రి అభినందించారు.

==========

రేపు జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా.. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ఈరోజు దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. మురాసు తుఫాను ప్రభావిత ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద నెలకొన్న పరిస్థితులు, రవాణా సౌకర్యాలు, ఎన్నికల సిబ్బంది సంసిద్ధత తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా.. చాలా జిల్లాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టాయని, కొన్ని ప్రాంతాలు మినహా మిగిలిన చోట్ల పోలింగ్ నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేవని కలెక్టర్లు తెలిపారు. వాతావరణం, స్థానికంగా నెలకొన్న పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఎస్ఈసీ కలెక్టర్లకు సూచించారు. ఎక్కడైనా ఎన్నికల నిర్వహణకు ఇబ్బందులు ఎదురైతే.. క్షేత్రస్థాయి అధికారుల నుంచి వాస్తవ పరిస్థితులపై సమగ్ర నివేదికలు తెప్పించుకుని, వాటి ఆధారంగా తగిన నిర్ణయాలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ఓటర్లు, ఎన్నికల సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే.. పోలింగ్ నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు.

==========

మురాసు తుఫాన్ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న రహదారుల పునరుద్ధరణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టినట్లు రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. ఈరోజు ఆయన అమరావతిలో విలేకర్లతో మాట్లాడుతూ... ప్రజలకు రవాణా ఇబ్బందులు కలగకుండా రహదారులపై పడిపోయిన చెట్ల తొలగింపు, ట్రాఫిక్ పునరుద్ధరణ, దెబ్బతిన్న ప్రాంతాల్లో తాత్కాలిక మరమ్మతులపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన జిల్లా రహదారులు, రాష్ట్ర రహదారులకు సంబంధించి సుమారు 162 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయని మంత్రి చెప్పారు. తుఫాన్ ప్రభావంతో 201 చెట్లు నేలకూలగా, అధికారులు వెంటనే స్పందించి మొత్తం చెట్లను తొలగించినట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల్లో 73 చోట్ల ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడగా, ఇప్పటికే 34 చోట్ల రాకపోకలను పునరుద్ధరించినట్లు వివరించారు. మిగిలిన ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ పునరుద్ధరణకు చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు.

==========

ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలానికి పెదవాగు నుండి వరద ప్రవాహం వచ్చే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ హెచ్చరికలు జారీ చేశారు. వేలేరుపాడు మండల పరధిలోని ముంపు గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్ళాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారీ వర్షాలతో వచ్చే ఆకస్మిక వరదల పట్ల జాగ్రత్త వహించాలని, అలాగే .. పొంగుతున్న వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయరాదని ప్రఖర్ జైన్ సూచించారు.

విరామం

==========

మురాసు తుఫాన్ ప్రభావంతో పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో దెబ్బతిన్న ప్రాంతాలను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావుతో కలిసి ఈరోజు పరిశీలించారు. రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దెబ్బతిన్న విద్యుత్ లైన్లను పరిశీలించిన ఆయన.. పునరుద్ధరణ పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఇప్పటికే కొంతమేర విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని, నేటి సాయంత్రానికి 60 శాతం విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు. పనులను వేగవంతం చేసేందుకు తమిళనాడు రాష్ట్ర విద్యుత్ సిబ్బంది సేవలను కూడా వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. వరుసగా వచ్చిన రెండు తుఫాన్ల కారణంగా విద్యుత్ శాఖకు సుమారు 500 నుండి 600 కోట్ల రూపాయల మేర నష్టం వాటిల్లినట్లు గొట్టిపాటి రవికుమార్ తెలియజేస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

==========

రేపు జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని రాష్ట్ర ఎన్నికల కార్యదర్శి డాక్టర్ ఏ. మల్లిఖార్జున తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా.. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ఈరోజు నిర్వహించిన దృశ్యమాధ్యమ సమావేశంలో మల్లిఖార్జున మాట్లాడుతూ.. ఈ ఎన్నికలలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 2 లక్షల 52 వేల మంది అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. అలాగే.. కౌంటింగ్ ప్రక్రియ కోసం సుమారు 52 వేల మంది సిబ్బంది సేవలను వినియోగించుకోనున్నామని చెప్పారు. గత ఎన్నికలతో పోలిస్తే... ఈసారి ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగి సుమారు 2 కోట్ల 61 లక్షలకు చేరుకుందని తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ.. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టామన్నారు.

==========

ఆక్లాండ్ లో ఈరోజు జరిగిన తొలి వన్డే క్రికెట్ మ్యాచ్ లో న్యూజిలాండ్‌పై భారత్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 40.2 ఓవర్లలో 185 పరుగులకు ఆలౌటైంది. అనంతరం భారత్ బ్యాటింగ్ ప్రారంభానికి ముందు వర్షంతో పలుమార్లు అంతరాయం కలిగింది. దీంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం లక్ష్యాన్ని 32 ఓవర్లకు 143 పరుగులకు కుదించారు. భారత్ మరో 56 బంతులు మిగిలి ఉండగానే 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని సాధించింది. భారత బ్యాటర్లలో విరాట్ కోహ్లీ 74, శుభ్‌మన్ గిల్ 37 పరుగులతో రాణించారు. 5 మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో ఉంది.

==========

తిరుమలలోని వాటర్ అండ్ ఫుడ్ అనాలసిస్ ల్యాబ్ ను దేశంలోనే ఆదర్శవంతంగా నిలిచేలా అభివృద్ధి చేస్తున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి తెలిపారు. వాటర్ అండ్ ఫుడ్ అనాలసిస్ ల్యాబ్ లో ఈరోజు జరిగిన ఆయుధపూజ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం ల్యాబ్‌లోని కార్యకలాపాలు, పనితీరుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించిన ఈ ఫుడ్ అండ్ వాటర్ అనాలసిస్ ల్యాబొరేటరీని 11 నెలల్లోనే అత్యాధునిక సదుపాయాలతో అభివృద్ధి చేశామని చెప్పారు. దేశంలోని ఏ ఇతర ఆలయాలు, సంస్థల్లో లేని విధంగా అత్యున్నత ప్రమాణాలతో ఈ ల్యాబ్‌ను నిర్మించినట్లు వెంకయ్య చౌదరి తెలియజేశారు.

==========

పల్నాడు జిల్లాలో రేపు జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ కృతిక శుక్ల తెలిపారు. ఈరోజు కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారులు, ఆర్వోలు, ఏఆర్వోలు, ఇతర అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్.. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, బ్యాలెట్ పత్రాలు, సిబ్బందికి విధుల కేటాయింపు, రవాణా, భద్రతా ఏర్పాట్లకు సంబంధించి పలు సూచనలు చేశారు.

==========
==========